



# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 21-06-2024 సంపుటి : 06 సంచిక : 275 పేజీలు : 8 వెల : రూ 3-00

## రష్యా-ఉక్రెయిన్ వార్‌ను అడ్డుకున్న మోదీ పేపర్ లీక్ ఆపలేకపోయారు : నీట్ రగడపై రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ, జూన్20 రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని మోదీ అడ్డకున్నారని చెబుతు న్నారు కానీ కొన్ని కారణాలతో ఆయన దేశంలో పేపర్ లీక్‌లనుఆపలేకపోతున్నారని కాంగ్రెస్ ఎంపీరాహుల్ గాంధీఎద్దేవా చేశారు. నీట్‌తో విద్యార్థు లకు అన్యాయం జరిగిందని నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.రాహుల్ గాంధీ గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నీట్ అంశం, యూజీసీ-నెట్ పరీక్ష రద్దు వ్యవహారంపై మాట్లాడారు. నీట్‌నిర్వహణలోలోటుపాట్లు, పేపర్ లీక్‌లతో విద్యార్థులు నష్టపోయారని, సుప్రీంకోర్టులో వారికి న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉందని అన్నారు. పేపర్ లీక్‌లను అడ్డుకోవడంలో మోదీ విఫలమయ్యారని ఆరోపిం చారు. విద్యా వ్యవస్థ బీజేపీ మాతృసంస్థ గుప్పిట్లో ఉండటంతోనే పేపర్ లీక్స్ జరుగుతున్నాయని అన్నారు. ఈ పరిస్థితి చక్కదిద్దేవరకూ పేపర్ లీక్‌లు జరుగుతూనే ఉంటాయని చెప్పారు. విద్యా వ్యవస్థను కాషాయ పార్టీ కబ్జా చేసేందుకు మోదీ పూనుకున్నారని, ఇది జాతి వ్యతిరేక చర్యని రాహుల్ ఆరోపించారు.

## నీట్ రద్దుపై కేంద్రం, ఎన్టీఏకు సుప్రీం నోటీసులు



న్యూఢిల్లీ: జూన్20 నీట్-యూజీ 2024పరీక్షలను రద్దు చేయాలని సుప్రీంకోర్టులో పిటీషన్లు దాఖలైన విషయం తెలిసిందే. ఆ కేసులో ఇవాళ కేంద్రం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీతో పాటు ఇతరులకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. నీట్ రద్దు చేయాలా అన్న అంశంపై వివరణ ఇవ్వాలని కోర్టు కోరింది. మెడికల్ ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో జరిగిన అవకతవకలపై కోర్టు ఆధ్వర్యంలో విచారణ జరగాలని సుప్రీం తెలిపింది. జస్టిస్ విక్రమ్ నాథ్, ఎస్వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. నీట్ రద్దుపై వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను సుప్రీంకు మార్చాలని ఎన్టీఏ పిటీషన్ దాఖలు చేసింది. దీనిపై వివిధ పార్టీల నుంచి ధర్మాసనం వివరణ కోరింది. జూలై 8వ తేదీన మళ్లీ ఈ కేసులో విచారణ చేపట్టనున్నట్లు కోర్టు చెప్పింది. నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని కొందరు విద్యార్థులు పెట్టుకున్న పిటీషన్‌పై కూడా కోర్టు విచారణ చేపట్టనున్నది. నీట్ నిర్వహణలో 0.001 శాతం నిర్లక్ష్యం ఉన్నా.. దాన్ని సరైన రీతిలో పరిష్కరించాలని సుప్రీం పేర్కొన్న విషయం తెలిసిందే. మే 5వ తేదీన జరిగిన నీట్ పరీక్ష పేపర్ లీకైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ పరీక్షలను 24 లక్షల మంది రాశారు.

## ప్రొటెం స్పీకర్‌గా గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రమాణం

అమరావతి జూన్20 : ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రొటెం స్పీకర్‌గాటీడీపీ సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రమాణం చేశారు.గురువారం రాజ్‌భవన్‌లోజరిగినకార్యక్రమంలోగవర్నర్ అబ్దుర్ నజీర్ గోరంట్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ , ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.రేపటి నుంచి రెండురోజుల పాటు ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అవుతుండడంతో ఎన్నికైన ఎమ్మెల్యేలలో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయించనున్నారు. రేపు ఉదయం 9.46 గంటలకు శాసనసభ సమావేశాలు ప్రారంభం కాగానే ఎమ్మెల్యేలు ప్రమాణం చేయనున్నారు. కొత్తగా ముఖ్య మంత్రి చంద్రబాబు నాయకత్వంలో అసెంబ్లీలో మరోమారు అడుగుపెట్టనుంది.ఇటీవల ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాలకు గాను కూటమి 164 స్థానాల్లో విజయం సాధించింది. వైసీపీ 11 స్థానాలకే పరిమితమై ప్రతిపక్ష హోదాను సైతం కోల్పోయింది. ఏడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన బుచ్చయ్యచౌదరిని చంద్ర బాబు ప్రొటెం స్పీకర్‌గా నియమిం చారు.




# ఎపి అంటేనే పోలవరం..అమరావతి

**ఈ రెండో రాష్ట్రానికి జీవనాడి**
**అమరావతి నిర్మాణం కోసం ఇక ప్రత్యేక శ్రద్ధ**
**రైతుల త్యాగం మరువలేనిదని వెల్లడి**
**అమరావతిలో పర్యటించిన సిఎం చంద్రబాబు**





అమరావతి,జూన్20 : ఏపీ అంటే అమరావతి, పోలవరం అని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. ఈ రెండూ జీవనాడి అని అన్నారు. గురువారం అమరావతి నిర్మాణాల పరిశీలన అనంతరం సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో చంద్రబాబు మాట్లాడారు అమరావతి రైతులు 1631 రోజులు ఆందోళన చేశారు. ఈ సంఖ్య కలిపితే వైకాపాకు వచ్చిన సీట్లకు సరిపోలుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రాజధాని పూర్తవుతుందనే నమ్మకంతో పోరాటాన్ని విరమించారు. రైతులందరికీ మనస్ఫూర్తిగా నమస్కారాలు. ఏపీ అంటే అమరావతి, పోలవరం. ఎవరూ పక్క రాష్ట్రాలకు వలస వెళ్లకుండా ఉండాలనే ఉద్దేశంతో ఇక్కడ రాజధాని నిర్మాణం చేపట్టామని అన్నారు. పోలవరం పూర్తయితే రాష్ట్రం మొత్తానికి నీరు వస్తుందనే ఉద్దేశంతో దానిని పూర్తి చేసేందుకు ప్రాధాన్యత ఇచ్చాం. పోలవరం పూర్తయితే రాయలసీమ రతనాల సీమగా మారుతుంది. అందుకోసం విభజన చట్టం తోడ్పాటు తీసుకున్నాం. పోలవరాన్ని వైకాపా ప్రభుత్వం గోదారిలో కలిపేసింది. రాష్ట్రానికి వరంగా మారాల్సిన పోలవరం శాపంగా మారింది. ఇటీవల ఎన్నికల్లో కూటమికి చరిత్రలో ఎన్నడూ కనీవినీ ఎరుగని విజయం ప్రజలు కట్టబెట్టారు. వైకాపా 11 సీట్లకే పరిమితమైంది. రాజకీయాలకు పనికిరాని వ్యక్తి ముఖ్యమంత్రి అయితే ఎలా ఉంటుందో గత అయిదేళ్లు ప్రత్యక్షంగా చూశాం. అమరావతి ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాదు. కేంద్ర నిధులతో పోలవరం కట్టి, ఇక్కడి నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటే సాగునీటి రంగానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని అన్నారు. పోలవరం సందర్శించాక చాలా బాధేస్తోంది. ప్రజావేదికను కూల్చి జగన్ పాలన ప్రారంభించారు. పవిత్ర జలాలు, మట్టి తీసుకొచ్చి ప్రధాని శంకుస్థాపన చేసిన ప్రాంతం కాబట్టి ఆ మట్టే మనల్ని కాపాడింది. పవిత్రమట్టి చూసిన తర్వాత అదే అనిపించింది. కొన్ని అల్లరిమూకలు ఇక్కడ ఏర్పాటు చేసిన నమూనాలను కూడా ధ్వంసం చేశాయి. అమరావతి రైతులు వాటిని కాపాడుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేశారు. పైపులు, రోడ్డు, మట్టిని దొంగతనం చేస్తున్నా వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎక్కడ కట్టిన బిల్డింగులు అలాగే ఉన్నాయి. ఐకానిక్ కట్టడాలన్నీ నిలిచిపోయాయి. ఎలాంటి మార్పు చేయలేదు. పూర్తి కావాల్సిన ఎన్నో పనులు నిలిపివేశారు. ఐఏఎస్, ఐపీఎస్ భవనాలు, అసెంబ్లీ బిల్డింగ్ ఉండాల్సిన చోట తుమ్మచెట్లు మొలిచాయి. రాజధాని పూర్తయి ఉంటే (చిత్రాన్ని చూపించారు) ఈ పాటికి ఇలా ఉండేది. కేంద్రం ఇచ్చిన ప్రోత్సాహంతో రాష్ట్రంలోని ప్రాంతాల్లో 11 కేంద్రీయ విద్యాసంస్థలు ఏర్పాటు చేశాం. అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం ఆనాడే స్పష్టమైన విధానం ప్రకటించామని అన్నారు. శివరామకృష్ణ కమిటీ చెప్పినట్లుగా సెంట్రల్‌లో అమరావతిని ఏర్పాటు చేశాం. అయినా రాజధానిపైన బురదజల్లే ప్రయత్నం చేశారు. అమరావతి బ్రాండ్‌ను దెబ్బతీయాలని చూశారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ అని ఆరోపించారు. విషం చిమ్మి సింగపూర్ కన్సార్టియంను తరిమేశారు. ఇక్కడి రైతులు స్వచ్ఛందంగా భూమిలిస్తే వారిపై ఎన్నో అపవాదులు వేశారు. మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడారు. అయిదేళ్ల తర్వాత మీ రాజధాని ఏది అని అడిగితే చెప్పుకోలేని పరిస్థితికి తీసుకొచ్చారు. ఇలాంటి వ్యక్తులకు ఓటేసిన వారు ఆలోచించుకోవాలి. అమరావతి, పోలవరం మాకేం సంబంధం అనుకోవద్దు. తెలుగుజాతి గర్వంగా తలెత్తుకునేలా రాజధాని నిర్మాణం ఉండాలన్నదే తమ సంకల్పమని అన్నారు. కర్నూలును ఆధునిక నగరంగా తయారు చేయాలి. 70-80 దేశాల్లో తెలుగు ప్రజలు అమరావతిని నాశనం చేయడంపై నిరసన తెలిపారు. రౌడీయిజం రాజకీయాల్లో లేకుండా చేస్తాం. అలాంటి వారిని ఉక్కుపాదంతో అణచివేస్తాం. రుషులు తపస్సులు చేసిన ప్రాంతం రుషికొండను నాశనం చేశారు. ఖజానా మొత్తం ఖాళీ అయ్యింది. లెక్కలు చూపించి.. చూపించకుండా ఎన్నో చోట్ల అప్పులు తీసుకొచ్చారు. హిరోషిమా, నాగసాకిని స్ఫూర్తిగా తీసుకొని ప్రజావేదికను జగన్ విధ్వంసానికి గుర్తుగా అలాగే ఉంచుతాం.గత సీఎంలు చేతనైతే అభివృద్ధి చేశారు. లేకుంటే ఊరుకున్నారు. జగన్ అలా చేయలేదని చంద్రబాబు తీవ్ర స్థాయిలో గత వైకాపా ప్రభుత్వంపై మండిపడ్డారు.

## ప్రజలకు మరింత చేరువయ్యేలా పోరాటాలు

**వైఎస్ఆర్‌సిపి విస్తృతస్థాయి సమావేశంలో మాజీ సిఎం వైఎస్ జగన్**




అమరావతి: జూన్20 ఈ ఎన్నికల్లో ఓటమి ఇంటర్వెల్ మాత్రమేనని వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. కోట్ల మంది ప్రజల్ని కాపాడాల్సిన బాధ్యత మనదేనని, వయసుతో పాటు పోరాడే సత్తా తనకుందన్నారు. వైఎస్ఆర్‌సిపి విస్తృతస్థాయి సమావేశంలో మాజీ సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాట్లాడారు. త్వరలోనే ప్రజలకు మరింత దగ్గరయ్యేలా పోరాటాలు చేస్తామని, మనల్ని నమ్ముకొని కొన్ని కోట్ల మంది ఉన్నారని, పార్టీ కార్యకర్తలకు మనం తోడుగా ఉండాలని, ఎన్నడూ లేని విధంగా వైసిపి కార్యకర్తలపై దాడు లు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే పార్టీ తరఫున ఆదుకునే కార్యక్రమాలు చేస్తున్నామని జగన్ స్పష్టం చేశారు. కేంద్రంలో టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి చక్రం తిప్పుతున్నట్టుగా చూపుతున్నారని, ప్రత్యేకహోదా దిశగా ప్రయత్నించకపోవడం శిశుపాలుడి పాపాల్లో ఒకటి అని, ప్రత్యేక హోదా విషయంలో ఎపి ప్రజలకు బాబు ఏం సమాధానం చెబుతావని ప్రశ్నించారు. శిశుపాలుడిలా బాబు పాపాలు పండుతున్నాయన్నారు. ఎన్నికల్లో న్యాయంగా, ధర్మంగా గెలిచింది మనమేనన్నారు. నాలుగేళ్ల వరకు అవిశ్వాసం పెట్టే అవకాశమే లేదని జగన్ పేర్కొన్నారు.

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరిస్తాం: పొంగులేటి

ఖమ్మంజూన్20 (ఆంధ్రరేఖ. ప్రతినిధి): గత బిఆర్ ఎస్ ప్రభుత్వంలో జర్నలిస్టులు చాలా కష్టాలు పడ్డారని ఐ అండ్ పిఆర్ , రెవెన్యూ, హౌజింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పత్రికా స్వేచ్ఛను గత పదేళ్లుగా అణచేశారన్నారు. విలేకరులపై దాడులు జరుగకుండా ఉండేందుకు ప్రత్యేక చట్టాన్ని తెస్తామని కూడా ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టులకు ఇండ్లు అందజేయడానికి త్వరలో ఓ పాలసీ అమలుచేస్తామన్నారు. టియూడబ్ల్యుజె(ఐజెయూ) రాష్ట్ర సమావేశానికి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఈ విషయాలు తెలిపారు. "మాజీ ముఖ్య మంత్రి కె.చంద్రశేఖర్ రావు జర్నలిస్టులను నిర్లక్ష్యం చేశారని, కానీ పూర్వ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ మీడియాకుఅనుకూలంగా వ్యవహరించారు" అన్నారు." తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు ముఖ్య పాత్ర పోషించారు. బిఆర్ఎస్‌పాలనలోకెసిఆర్ కేవలం వాగ్దానాలే చేశారు తప్ప జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించ లేదు. ఆయనవన్నీ శుష్క వాగ్దానాలే. ప్రస్తుత ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కేటాయించిన భూమిని హైదరాబాద్ జర్నలిస్టుల హౌజింగ్ సొసైటీకి త్వరలో అప్పగించడానికి సిద్ధంగా ఉన్నారు.దానికిసంబంధిం చిన జివో వారం లేక 10 రోజుల్లో విడుదలచేయొచ్చు.మండలాలు,జిల్లాల్లో, హైదరాబాద్ లోని అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిం చేందుకు ఓపాలసీతీసుకురాను న్నాము. జూన్ లో ముగిసే అక్రిడాటేషన్ వ్యాలిడిటీని మరో మూడు నెలలు పెంచను న్నాము.

## ఏపీ డీజీపీగా ద్వారకా తిరుమలరావు



అమరావతి, జూన్ 20 1989 ఐపీఎస్ బ్యాచ్కు చెందిన ద్వారకా తిరుమల రావును నూతన డీజీపీగా ఏపీ ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ద్వారకా తిరుమలరావు ఏపీఎస్ ఆర్టీసీ ఎండీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఏపీ డీజీపీగా ఉన్న హరీష్ గుప్తాను మళ్లీ హోం సెక్రటరీగా ప్రభుత్వం బదిలీ చేసింది.

## బాధ్యతలు స్వీకరించిన మంత్రి వాసంశెట్టి సుభాష్



అమరావతి జూన్20 రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీలు, బాయిలర్స్ మరియు ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ శాఖ మంత్రిగా వాసంశెట్టి సుభాష్ బాధ్యతలు చేపట్టారు. మంత్రిగా బాధ్యత చేపట్టేందుకు రాష్ట్ర సచివాలయానికి కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు వేద పండితులు పూర్ణకుంభం తోను, అధికారులు పుష్ప గుచ్చాలను అందజేస్తూ ఘనంగా స్వాగతం పలికారు. చ పండితుల వేద మంత్రోచ్ఛారణ ల మధ్య ఆ భగవంతునికి షోడశోపచారా పూజ నిర్వహించిన తదుపరి తమ సీట్లో ఆసీనులు అయ్యారు. గత ప్రభుత్వ హయాంలో అమల్లోవున్న వైయస్సార్ భీమా పథకానికి పేరు మారుస్తూ తొలి ఫైల్ పై సంతకం చేశారు. వైయస్సార్ బీమా పథకాన్ని చంద్రన్న బీమా పథకంగా పేరు మారుస్తూ తొలి సంతకం.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం విషయంలో గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించిందన్నారు. నవరత్నాల పథకాలు పేరుతో కార్మికుల సంక్షేమానికి సంబంధించిన 13 పథకాల అమలును నిలుపుదల చేసిందన్నారు. కార్మిక శాఖకు వచ్చిన రూ.3,000 కోట్ల సెస్సును పూర్తిగా పక్కదారి పట్టించడం జరిగిందన్నారు. కార్మిక భీమా పథకం కింద గతంలో శ్రీ నారా చంద్రబాబు నాయుడు హయాంలో రూ.2.55 కోట్ల భీమా సొమ్మును చెల్లిస్తే, గత ప్రభుత్వ హయాంలో కేవలం రూ.1.25 కోట్లను మాత్రమే చెల్లించడం జరిగిందని ఆయన విమర్శించారు.

# సంపాదకీయం

శుక్రవారం 21-06-2024

## నిరుద్యోగ సమస్యకు ఫుల్ స్టాప్ ఎప్పుడు

దేశంలో నిరుద్యోగ సమస్య అత్యంత తీవ్రంగా ఉంది. ప్రతి సర్వేలో మంచి జీతంతో కూడిన సురక్షితమైన ఉద్యోగాలు లేకపోవడమే తమ సమస్య అని దేశ ప్రజలు చెబుతున్నారు. భారతీయ జనాభాలో మూడింట రెండొంతుల మంది పని చేసే వయస్సులో ఉన్నారు. అంటే, వారు 15-65 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు. పని చేసే వయస్సు గల వ్యక్తుల ఈ నిష్పత్తి ప్రపంచ సగటు కంటే చాలా ఎక్కువ. అయినప్పటికీ, పని చేసే వయస్సులో ఎక్కువ మంది వ్యక్తులు ఎటువంటి వేతనంతో కూడిన పని దొరకక వారి శక్తి పూర్తిగా వృధా అవుతోంది. వీరిని నిరుద్యోగులుగా పరిగణిస్తున్నారు. వాస్తవానికి ఆర్థిక వ్యవస్థ పెట్టుబడిదారీగా ఉన్నంత కాలం నిరుద్యోగానికి పరిష్కారం లేదు. సమస్యకు పరిష్కారం లేకపోవడంతో, రాజకీయ పార్టీలు కుల ప్రాతిపదికన రిజర్వేషన్ కోటాల కోసం ప్రజల మధ్య పోటీని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాయి. ఉన్న కొద్దిపాటి ఉద్యోగాల విషయంలో నిరుద్యోగ యువత తమలో తాము పోట్లాడుకునేలా చేస్తున్నారు. సమస్య మూలాన్ని తొలగించకుండా నిరుద్యోగ సమస్యను పరిష్కరించడం సాధ్యం కాదు. యువతకు నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. ప్రతి సంవత్సరం దాదాపు 50 లక్షల మంది యువత శ్రామికశక్తిలో చేరుతున్నారు కానీ వారిలో చాలా మందికి వేతనంతో కూడిన పని దొరకడం లేదు. 2024 జనవరి-మార్చి త్రైమాసికానికి సంబంధించిన తాజా పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం దేశంలో 15-29 ఏళ్ల మధ్య ఉన్న ప్రతి ఆరుగురిలో ఒకరు నిరుద్యోగులుగా ఉన్నారు. నిరుద్యోగులందరిలో సెకండరీ పాఠశాల పూర్తి చేసిన యువత నిష్పత్తి 2000లో 54% ఉండగా, అది 2022 నాటికి 66%కి పెరిగింది. కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వం క్లరికల్ ఉద్యోగాల్లో కొన్ని వందల ఖాళీలను భర్తీ చేయాలని యోచిస్తున్నట్లు ప్రకటించినప్పుడల్లా వేలాది మంది గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, పీహెచ్‌డీలు కూడా ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటారు. అధిక అర్హత కలిగిన యువతలో చాలా తక్కువ మందికి ప్రైవేట్ కంపెనీలలో రెగ్యులర్ ఉద్యోగాలు లభిస్తున్నాయి. మరోవైపున లక్షలాది మంది యువత రైల్వేలో లేదా ఇతర ప్రభుత్వ శాఖలలో ఉద్యోగం కోసం, ఒకదాని తర్వాత మరొకటి అర్హత పరీక్షలకు సిద్ధమవుతూ, రాస్తూ వృథాగా సంవత్సరాలు గడుపుతున్నారు. ఏటా ఉద్యోగాల సృష్టి కంటే తగ్గుతున్నవే ఎక్కువ. ఈ ఏడాది ఐఐటీ వంటి ప్రముఖ విద్యాసంస్థల్లో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు కూడా ఉద్యోగం కోసం కష్టపడుతున్నారు. అందుబాటులో ఉన్న ఉద్యోగాల పరిమాణం నిలిచిపోవడమే కాకుండా, ఉద్యోగాల నాణ్యత క్షీణిస్తోంది. మెజారిటీ కంపెనీలలో, సాధారణ శాశ్వత ఉద్యోగాల కంటే తాత్కాలిక ఒప్పంద ఉద్యోగాలు పెరుగుతున్నాయి. ఎక్కువ మంది కార్మికులు ఎటువంటి సామాజిక భద్రత లేకుండా ఎక్కువ గంటలు కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేయవలసి వస్తుంది. భారీ సంఖ్యలో నిరుద్యోగుల ఉనికి ఉపాధి కార్మికుల వేతనాలను తొక్కివేయడానికి, వారి హక్కులను హరించడానికి కూడా ఉపయోగించబడుతోంది. జీవనం కొనసాగించడానికి ఎక్కువ పని గంటలు పని చేసే పరిస్థితి ఉంది. ప్రభుత్వరంగంలో భారీ పరిశ్రమల స్థాపన ఉనికి లేకపోవడంతో విస్తృత సంఖ్యలో ఉద్యోగాల కల్పనకు గండి పడింది. నిరుద్యోగం పెరుగుదల రేటు 45 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా 2017?18లో 6.1శాతానికి ఎగబాకింది. కోవిడ్ ముమ్మరించిన 2020 ఏప్రిల్?జూన్ త్రైమాసికంలో 20.8 శాతానికి చేరుకొని విలయ నాట్యమాడింది. ఆ కాలంలో పట్టణాల నుంచి పల్లెలకు ఎదురు వలసలు విజృంభించాయి. ఆ విపత్కాలంలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం విశేషంగా తోడ్పడింది. ఎంతగా అంటే 2019లో ఈ పథకం ద్వారా 260 కోట్ల వ్యక్తి దినాల ఉపాధి పని కల్పించగా 2021లో అది 390 కోట్ల వ్యక్తి దినాలకు పెరిగింది. భూమిలేని నిరుపేద గ్రామీణ వ్యవసాయ కార్మికులకు పని హక్కును కల్పించడానికి యూపీఏ ప్రభుత్వం ఆవిష్కరించిన ఈ పథకాన్ని బలహీనపరచేందుకు కేంద్రంలోని అధికారపక్షం శతవిధాలా ప్రయత్నించింది. ఈపథకానికిఆధార్ అనుసంధానమనే గుదిబం డను వేయొద్దని సుప్రీంకోర్టు ఆదేశించినా ఫలితం లేకపోయింది. దీనికి బడ్జెట్‌లో కేటాయి ంపుల కోత వంటి చర్యలకూ ప్రభుత్వం పాల్పడింది. బీజేపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన పెద్ద నోట్ల రద్దు పథకం, వస్తు సేవల పన్ను (జీఎస్టీ) నిరుద్యోగాన్ని, నిర్వ్యాపా రాన్ని పెంచాయి. కింది స్థాయి కార్మికుల పనులను హరించి వేశాయి. అనాలోచితంగా ప్రకటించిన ఆకస్మిక లాక్ డౌన్ అసంఘటిత రంగ కార్మిక లోకాన్ని కష్టాల కొలిమిలో తోసివేసింది. నిరుద్యోగాన్ని తగ్గించడానికి శాస్త్రీయమైన దారులు అనుసరించని మోదీ ప్రభుత్వం దానిని అంచనా వేయడానికి అంతవరకు గల పద్ధతులను కూడా రద్దు చేసింది. ప్రభుత్వం చేపట్టే వార్షిక ఉద్యోగ నిరుద్యోగ సర్వేకి 2017లో స్వస్తి చెప్పింది. కార్మిక విభాగం (లేబర్ బ్యూరో) మూడు మాసాలకు ఒకసారి నిర్వహించే వ్యాపార సంస్థల సర్వేని కూడా మాన్పించింది. ఆచరణలో నిరుద్యోగం లోతులు తెలుసుకోడానికి ఏర్పాటు చేసిన శాస్త్రీయ పద్ధతులకు నిలువ నీడ లేకుండా చేస్తూ నిరుద్యోగానికి సంబంధించి పూర్తి వివరాలు అందుబాటులో లేవని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ నిస్సహాయత ప్రకటించడం విడ్డూరంగా లేదూ? ఉద్యోగాలు ఎప్పటికీ దొరక్కపోవడంతో విసిగిపోయిన కోట్లాది నిరుద్యోగులు దుర్భరమైన ఆర్థిక బాధలను తట్టుకోడానికి స్వయం ఉపాధులను ఆశ్రయిస్తున్నారని స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా?2023 నివేదిక నిగ్గుదేల్చింది. కార్మికులకు విశేషంగా పనులు కల్పించగల తయారీ రంగాన్ని బలోపేతం చేయడానికి మోదీ ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మ నిర్భర్ భారత్' పథకాలను ప్రారంభించింది. ఇవి వచ్చిన తర్వాత 2016?2021 మధ్య తయారీ రంగంలో ఉద్యోగాలు సగానికి పడిపోయాయి. కోవిడ్‌కి ముందే దేశ తయారీ రంగం కునకడం మొదలుపెట్టింది.

# పుట్టుక నీది.... చావు నీది.... బ్రతుకంత తెలంగాణది




హైదరాబాద్ జూన్ 20 : తెలంగాణ సిద్ధాంతకర్తగా పేరుపొందిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 1934, ఆగస్టు 6 న వరంగల్ జిల్లా, ఆత్మకూరు మండలం అక్కంపేటలో జయశంకర్ విశ్వబ్రాహ్మణ కులం లో జన్మించారు. తల్లి మహాలక్ష్మి, తండ్రి లక్ష్మీకాంత్‌రావు. ఆయనకు ముగ్గురు అన్నదమ్ములు, ముగ్గురు అక్కచెల్లెళ్లు ఉన్నారు. జయశంకర్ తల్లిదండ్రులకు రెండో సంతానం. సొంత కుటుంబాన్ని నిర్మించుకోకుండా తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా మిగిలిపోయాడు.. తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో మంచి ప్రావీణ్యం ఉన్న జయశంకర్ తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా జీవించారు. ఆర్థికశాస్త్రంలో పీహెచ్‌డి పట్టా పొంది, ప్రిన్సిపాల్‌గా, రిజిస్ట్రార్‌గా పనిచేసి కాకతీయ విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ వరకు ఉన్నత పదవులు పొందారు. 1969 తెలంగాణ ఉద్యమంలోనూ, అంతకు ముందు నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్- ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఏర్పాటులో కె.చంద్రశేఖరరావుకు సలహాదారుగా, మార్గదర్శిగా వెన్నంటి నిలిచారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై పలు పుస్తకాలు రచించారు. అధ్యాపకుడిగా ఆయన ఎంతో మందికి మార్గనిర్దేశం చేశారు. వృత్తిపట్ల నిబద్ధతను, తెలంగాణ ఉద్యమం పట్ల చిత్తశుద్ధిని వారిలో నూరిపోశారు. ఎమ్జన్సీ కాలంలో ఆయన సీకేఎం కళాశాలకు ప్రిన్సిపల్‌గా పనిచేశారు. సీకేఎం కళాశాల అంటేనే జిల్లాలో విప్లవ విద్యార్థి ఉద్యమానికి కేంద్రంగా అప్పట్లో పేరుండేంది. విప్లవకవి వరవరరావు లాంటి వాళ్లు ఆ కాలేజీలో అధ్యాపకులుగా వ్యవహరించారు. ఎమ్జన్సీ గడ్డురోజుల్లో ఆయన కళాశాలను నడిపి ఎంతో మంది విద్యార్థుల్ని, అధ్యాపకుల్ని ఆయన నిర్బంధం నుంచి కాపాడారు. ఆయన అధ్యాపకుడిగా హన్మకొండలోని మల్టీపర్పస్ స్కూల్లో మొదట తెలుగు బోధించారు. ఒక

### -నేడు తెలంగాణా జాతి పిత ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి


అధ్యాపకున్ని విద్యార్థులు గుర్తుపెట్టుకోవడం సర్వసాధారణమే కానీ ఒక అధ్యాపకుడే తన విద్యార్థుల్ని గుర్తుపెట్టుకొని పేరుపెట్టి పిలవడం ఒక్క జయశంకర్ కే సాధ్యం అంటూ ఆయనకు తనకు 35 ఏళ్ల అనుబంధం ఉందని, ప్రముఖ సాహితివేత్త రామశాస్త్రి కన్నీళ్లపర్యంతమయ్యారు. జయశంకర్ విద్యార్థుల్లో అనేక మంది దేశవిదేశాల్లో ప్రస్తుతం ప్రముఖ స్థానంలో ఉన్నారు. వీరిలో కేయూ మాజీ ప్రొఫెసర్ ఎన్. లింగమూర్తి, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, ప్రొఫెసర్ కే. సీతారామావు తదితరులు అనేక మందికి ఆదర్శ గురువు జయశంకర్. తెలంగాణా ఉద్యమంలో 1969 తెలంగాణా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. 1952 లో జయశంకర్ నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్, ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నాడు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి నాయకుడిగా ఆయన 1954 లో ఫజల్ అలీ కమిషన్‌కు నివేదిక ఇచ్చాడు. కె.సి.ఆర్‌కు సలహాదారుగా, మార్గదర్శిగా తోడ్పాటు అందించాడు. తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై ఆయన పుస్తకాలు రాశాడు. తెలంగాణలోనే కాకుండా, దేశంలోని ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత గురించి ప్రసంగాలు చేశాడు. జయశంకర్ తన ఆస్తిని, జీవితాన్ని తెలంగాణ కోసం అంకితం చేశాడు. అబ్ తొ ఏక్ హీ ఖ్వాయిష్ హై, వొ తెలంగాణ దేఖ్‌నా ఔర్ మర్‌జానా' (ఇప్పుడైతే నాకు ఒకే కోరిక మిగిలింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలి, తర్వాత మరణించాలి) అని అనేవాడు. విదేశాల్లో తెలంగాణ ఉద్యమాన్ని నడిపిన తెలంగాణ ఉద్యమాన్ని గల్లీ నుంచి ఢిల్లీదాకా, ఢిల్లీ నుంచి అమెరికా దాకా వ్యాప్తిచేయడంలో ఆయన పాత్ర మరవలేనిది. విద్యార్థి దశ నుంచే తెలం'గానం'ఆచార్య జయశంకర్ విద్యార్థి దశ నుంచే తెలంగాణకు జరుగుతోన్న అన్యాయాల పట్ల, అసమానతల పట్ల తీవ్రంగా పోరాటం చేశారు. 1952 నాన్ ముల్కీ ఉద్యమంలోకి ఉరికి ఆనాటి నుంచి సమరశీల పాత్రను పోషించారు. ఎవరూ మాట్లాడటానికి సాహసించని కాలంలోనే 1954 విశాలాంధ్ర ప్రతిపాదనను ఎండగట్టిన ధీశాలి జయశంకర్. విశాలాంధ్ర ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ మొదటి ఎస్సార్సీ కమిషన్ ముందు హాజరై తెలంగాణ వాణిని బలంగా వినిపించిన మేధావి కొత్తపల్లి జయశంకర్. అధ్యాపకునిగా, పరిశోధకుడిగా ఆయన ఏం చేసినా తెలంగాణ కోణంలోనే నిత్యం ఆలోచించి ఆచరించే మహనీయుడు. తెలంగాణ డిమాండ్‌ను 1969 నుంచి సునిశితంగా అధ్యయనం చేస్తూ, విశ్లేషిస్తూ ప్రతీరోజూ రచనలు చేసాడు. తెలంగాణలోని ప్రతీపల్లె ఆయన మాటతో పోరాట గుత్ప అందుకున్నది. ఆయన తిరగని ప్రాంతం లేదు. తెలంగాణ విషయంలో ఆయన చెప్పని సత్యం లేదు. జాతీయ, అంతర్జాతీయ వేదికలమీద, విశ్వవిద్యాలయాల పరిశోధనా సంస్థల సభలో, సమావేశాల్లో తెలంగాణ రణన్నినాదాన్ని వినింపించిన పోరాట శీలి. ఉస్మానియాను తలుచుకుంటే తెలంగాణ వాడినైనందుకు గర్వంతో ఛాతి ఉబ్బుతుంది. ఎన్నెన్ని పోరాటాలకు, ఆరాటాలకు అది వేదికైంది చెప్పు.. అందరికీ ఉస్మానియా యూనివర్శిటీ అంటే చెట్లు కనిపిస్తయి.. కానీ మొన్నటికి మొన్న తెలంగాణ కోసం అమరులైన అనేక మంది విద్యార్థులు ఆ చెట్ల సాక్షిగా నాకు ఎంతమందికి దక్కుతుంది. వాళ్లకు మరణం లేదు? అదే ఉస్మానియాలో డిసెంబర్ 9 ప్రకటన తర్వాత పిల్లలు జరుపుకున్న సంబరం నా జీవితంలో మర్చిపోలేని గొప్ప జ్ఞాపకం. కానీ వారి భవిష్యత్ కలలతో ఆడుకున్నది ఎవరు? వారి ఆశలతో ఆడుకుని? వారి శవాలపై ప్రమాణం చేసిన రాజకీయనాయకులకు వాళ్ల ఉసురు తగలకుండా పోతుందా'తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర కాంక్ష గురించిమా వనరులు మాకున్నాయి. మా వనరులపై మాకు అధికారం కావాలి. యాచక దశ నుంచి శాసక దశకు తెలంగాణ రావాలి! మా తెలంగాణ మాగ్గావాలి..!!తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలని తరుచుగా చెప్పే జయశంకర్ 2011 జూన్ 21న ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ముందే మరణించారు.

# అభివృద్ధి పనులు ఆగకూడదు

రంగారెడజూన్ 20 కూకట్పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమావేశం నిర్వహించారు. అధికారులతో మాట్లాడుతూ గత ఆరు నెలలుగా ఎలాంటి అభివృద్ధి జరగకుండా పెండింగ్లో ఉన్న పనులను సైతం పట్టించుకోకుండా అధికారులు వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా వేల కోట్ల రూపాయలతో కూకట్పల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని అభివృద్ధిలో ఎలాంటి ఆటంకాలు జరగకుండా అందరి సహకారంతో ట్రాఫిక్ సమస్యలను డ్రైనేజీ సమస్యలను మంచినీటి సమస్యలను నిర్మూలించామన్నారు. ప్రభుత్వం మారిన ఆరు నెలల్లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగకపోగా గత సంవత్సరంలో 65 కోట్ల రూపాయలతో రోడ్లు డ్రైనేజీ మంచినీటి పైప్లైన్ లకు శంకుస్థాపనలు చేసి టెండర్లు జరిగిన అలాంటి పనులను పక్కన పెడుతున్నారని జిహెచ్ఎంసి అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి కొరకు ఎక్కడికి వెళ్లడానికైనా వెనకాడననితి అభివృద్ధి కోసం పని చేస్తామన్నారు.

# తలసాని శంకర్ యాదవ్‌కు ఘన నివాళులర్పించిన కేటీఆర్, హరీశ్‌రావు

హైదరాబాద్ జూన్ 20 సికింద్రాబాద్‌లోని ఎస్‌వీఐటీ ఆడిటోరియంలో తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు తలసాని శంకర్ యాదవ్ దశదిన



కర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేటీఆర్, హరీశ్‌రావు, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యేలు, ప్రకాశ్ గౌడ్. మల్లారెడ్డితో పాటు పలువురు నాయకులు హాజరై శంకర్ యాదవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

# చేనేత జౌళి శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సవిత

**యువతరం డిమాండ్‌లకు అనుగుణంగా చేనేత వస్త్రాలు**
**సాంప్రదాయలను కాపాడుకుంటూ చేనేత రంగం అభివృద్ధి**

అమరావతి జూన్ 20 సమకాలీన మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సంప్రదాయ నైపుణ్యాలను కాపాడుకుంటూ చేనేత రంగాన్ని అభివృద్ధి పథంలో పయనింపచేయటమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత అన్నారు. ఆధునిక ఫ్యాషన్ పోకడలతో సాంప్రదాయ హస్తకళను మిళితం చేస్తూ యువతరం డిమాండ్‌లకు అనుగుణంగా చేనేత వస్త్రాలను రూపొందిస్తున్నామన్నారు. గురువారం సచివాలయంలో చేనేత మరియు జౌళి శాఖ మంత్రిగా సవిత బాధ్యతలను స్వీకరించారు. చేనేత జౌళి శాఖతో పాటు వెనుకబడిన తరగతుల సంక్షేమం శాఖ మంత్రిగా కూడా ఆమె బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరి వెంకటగిరి చీరాల ధర్మవరం పులుగుర్తలలో చేనేత వర్గాల అభ్యున్నతికి ఉద్దేశించిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం అమలుకు సంబంధించి తొలి సంతకం చేనేత జౌళి శాఖ మంత్రిగా చేశారు. మొత్తం 180 మంది నేత కార్మికులకు ప్రయోజనం చేకూర్చేలా కార్యక్రమం





రూపొందింది. మరోవైపు ఆప్కో(ఆంధ్రప్రదేశ్ స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ) సహకారంతో చేనేత జౌళి శాఖలోని అంతర్గత క్లస్టర్ డిజైనర్లు రూపొందించిన కొత్త వస్త్రాల సేకరణను సవిత ప్రారంభించారు. స్థానిక కళాకారులకు మద్దతుగా మంత్రి ఆప్కో నుండి క్రోచెట్ లేస్ కాటన్ చీర, లేపాక్షి నుండి ఏటికొప్పాక ఎద్దుల బండిని కొనుగోలు చేశారు. ఈ కొనుగోళ్లు ఆంధ్రప్రదేశ్ యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వం హస్తకళను ప్రోత్సహం సంరక్షణలో ఆమె నిబద్ధతను నొక్కిచెప్పాయి. రాష్ట్రంలో ఓడిఓపి ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు సచివాలయంలో ఏర్పాటు చేసిన ఓడిఓపి ప్రదర్శనను కూడా మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి సునీత ఆప్కో ఎండి పావన మూర్తి జిఎం తనూజ రాణి లేపాక్షి ఎండి బాలసుబ్రమణ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జలవనరులశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రామానాయుడు



అమరావతి:జూన్ 20 ఏపీ జలవనరులశాఖ మంత్రిగా టిడిపి నేత నిమ్మల రామానాయుడు కొద్దిసేపటి క్రితం బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలోని నాలుగో బ్లాక్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తనకు కీలకమైన జలవనరులశాఖ అప్పగించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు పోలవరం పనులను వేగంగా చేశామని, కానీ వైసిపి అధికారంలోకి వచ్చాక పోలవరాన్ని అస్సలు పట్టించుకోలేదని విమర్శించారు. ప్రాజెక్టు పనులపై సమీక్షించి నిర్మాణాన్ని వేగవంతం చేస్తామని చెప్పారు. తప్పు చేసే ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్న తాము పోలవరం కోసం మరిన్ని నిధులు తీసుకొస్తామని తెలిపారు. వ్యవసాయం, రైతుల విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, కాలువల్లో నీరు పారకుండా చేశారని విమర్శించారు. కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపు, పూడిక తీతపై తొలి సంతకం చేసినట్టు వివరించారు.

# పోరాడతారా.... యూ టర్న్ తీసుకుంటారా..?

విజయవాడ, జూన్ 20, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలకు రంగం సిద్ధమవుతోంది. అటూ ఇటూ మార్చినా చివరికి 21, 22 తేదీల్లో సభను సమావేశపరాచలని డిసైడయ్యారు. ఈ రెండు రోజుల్లో సభ్యుల ప్రమాణ స్వీకారం, స్పీకర్ ఎన్నిక ప్రక్రియను పూర్తి చేస్తారు. తర్వాత వాయిదా వేస్తారా కొనసాగిస్తారా అన్నది అప్పుడే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. అయితే గత ప్రభుత్వ విధ్వంసం మొత్తాన్ని ప్రజల ముందు ఉంచాలంటే పక్కాగా శ్వేతపత్రాలు సిద్ధం చేయాల్సి ఉందని.. అందుకే ముందుగా సభ్యుల ప్రమాణ స్వీకారం, స్పీకర్ ఎన్నికకే పరిమితం చేస్తున్నారని భావిస్తున్నారు. అయితే ఆ తర్వాత రెండు వారాలకయినా మళ్లీ పూర్తి స్థాయి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. పూర్తి స్థాయి బడ్జెట్ కూడా ప్రవేశ పెట్టాల్సి ఉంది. ఎన్నికల కారణంగా జగన్ ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ ను మాత్రమే ప్రవేశ పెట్టింది. ప్రమాణ స్వీకార సమావేశాలకు, ఆ తర్వాత జరగాల్సిన సమవేశాలకు మాజీ సీఎం జగన్ హాజరవుతారా.. లేకపోతే గతంలోలా బహిష్కరణ అస్త్రం ప్రయోగిస్తారా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఎందుకంటే ఏపీ రాజకీయాలు ప్రతిపక్ష నేత సభకు రాలేనంత ఘోరంగా గత ఐదేళ్లలో దిగజారిపోయాయి. టీడీపీ నేతలు ప్రతీకారం కోసం ఎదురు చూస్తున్నారని చెప్పాల్సిన పని లేదు. అందుకే సభకు వెళ్లడం.. అపరిమితమైన బలంతో ఉన్న అధికార పక్షాన్ని ఎదుర్కోవడం అంత తేలిక కాదన్న భావన ఉంది. అసెంబ్లీలో వైఎస్ఆర్‌సీపీకి కేవలం పదకొండు మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో గట్టిగా నిలబడి అధికారపక్షంగా తన వాయిస్ గా గడగడలాడించేవారు ఎవరూ లేరు. జగన్ కన్నా రాజకీయాల్లో సీనియర్ అయని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మరోసారి గెలిచి అసెంబ్లీలో అడుగు పెడుతున్నారు. కానీ ఆయన తెరవెనుక రాజకీయ వ్యూహాల్లో దిట్ట కానీ అసెంబ్లీలో నిలబి సాధికారికంగా మాట్లాడి అధికారపక్షానికి కౌంటర్ ఇచ్చేంత టాకింగ్ పవర్ లేదు. ఉన్నదల్లా జగన్మోహన్ రెడ్డి మాత్రమే. ప్రతీ దానికి ఆయనే మైకందుకోవాల్సి ఉంటుంది. కానీ మైక్ ఎంత సేపు ఇస్తారన్నది కూడా పజిలే. ప్రధాన ప్రతిపక్ష హోదా గుర్తింపు వచ్చి ఉంటే.. అధికారపక్షంతో పాటుగా తమకూ ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేయవచ్చు. సభా సంప్రదాయాలు కాపాడాలని కోరవచ్చు. కానీ ఇక్కడ వైసీపీకి ప్రధాన ప్రతిపక్ష నేత హోదా రాలేదు. అంతకు మించి జగన్‌కు ముందు వరుసలో సీటు లభిస్తుందో లేదో చెప్పలేని పరిస్థితి. స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటే అ నిర్ణయానికి శిరసావహించాల్సిందే. గత అసెంబ్లీలో తెలుగుదేశం పార్టీకి 23 మంది సభ్యులు ఉన్నారు. ప్రధాన ప్రతిపక్షనేతగా చంద్రబాబుకు హోదా ఉంది. అయినా అసెంబ్లీలో ఆయనను ఘోరంగా అవమానించారు. ప్రతి ఒక్క వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే ఆయనను వ్యక్తిగతంగా కించ పరిచారు. ఆయన కుటుంబాన్ని ఘోరంగా తిట్టారు. ఈ తిట్లు తట్టుకోలేక ఆయన చాలెంజ్ చేసి బయటకు వెళ్లారు. కౌరవసభలా చేశారని.. గౌరవసభగా చేసి మళ్లీ ముఖ్యమంత్రిగా సభలోకి వస్తానని చాలెంజ్ చేసి వెళ్లారు.అలాగే అడుగు పెడుతున్నారు. గత సభలో ఇంత జరిగితే ఆ పరిస్థితులందటికి కారణమైన వైఎస్ఆర్‌సీపీ వారిని టీడీపీ సభ్యులు వదిలి పెట్టే అవకాశం ఉండదు. పైగా జగన్మోహన్ రెడ్డి ఓటమి భారంలో ఉన్నారు. 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో జగన్ ను టార్గెట్ చేయడానికి టీడీపీ ఖచ్చితంగా ప్రయత్నిస్తుంది. ప్రజాస్వామ్య పద్దతుల్లో అయినా జగన్ పై ఎటాక్ ఖాయం. ఏ ప్రభుత్వం మారినా గత ప్రభుత్వంలో తప్పులు, అవకతవకలు అంటూ అసెంబ్లీలో ప్రకటనలు చేస్తుంది. జగన్ ప్రభుత్వం లో అలాంటివి లెక్కలేనన్ని ఉన్నాయని టీడీపీ చెబుతోంది. ఇప్పటికే కొన్ని శాంపిల్స్ రిలీజ్ చేసింది. జగన్ ప్రైవేటు నివాసానికి కోట్ల ప్రజాధనం వెచ్చి ఫర్నీచర్ తోపాటు ఇతర సౌకర్యాలు కల్పించుకోవడం, ఐదు వందల కోట్లు పెట్టి రుషికొండ ప్యాలెస్ ను నిర్మించుకోవడం... ప్రాజెక్టుల్ని నిర్లక్ష్యం చేయడం వంటివన్నీ బయటకు వస్తున్నాయి. అలాగే కొండంత అప్పులు చేశారని టీడీపీ నిందిస్తోంది. ఈ మొత్తం వ్యవహారాలపై వైట్ పేపర్లు రిలీజ్ చేయాలనుకుంటున్నారు. అంటే అది పూర్తిగా జగన్ పాలనా వైఫల్యాలను ప్రజల ముందు పెట్టడమే. దీనికి కౌంటర్ ఇచ్చుకోవడం.. పదకొండు మంది ఎమ్మెల్యేలతో జగన్‌కు కష్టమవుతుంది. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు జగన్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. మామూలుగా అయితే విస్తృత స్థాయి సమావేశం అవసరం లేదు. గెలిచిన ఎమ్మెల్యేలతో ఎల్పీ భేటీ నిర్వహించి నాయకుడ్ని ఎన్నుకుంటారు. ఇప్పటి వరకూ అలాంటి ఆలోచన చేయలేదు. నేరుగా విస్తృత స్థాయి సమావేశానికి పిలుపునిచ్చారు.అంటే ఖచ్చితంగా అసెంబ్లీ బహిష్కరణ నిర్ణయం తీసుకుంటారని అంటున్నారు.గతంలో కూడాజగన్ ఓ సారి అసెంబ్లీ బ బహిష్కరణ నిర్ణయం తీసుకున్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హతా వేటు వేయకపోవడానికి నిరసనగా అసెంబ్లీని బహిష్కరంచారు. తానే కాదు.. యాభై మంది వరకూ ఉన్న తన ఎమ్మెల్యేలను కూడా అసెంబ్లీకి పోనివ్వలేదు. అప్పుడు కూడా ఇలా విస్తృత స్థాయి సమావేశాన్ని లోటస్ పాండ్‌లో నిర్వహించి నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు నిర్వహించబోయే విస్తృత స్థాయి సమావేశంపై అందుకే రాజకీయవర్గాల్లో ఆసక్తి వ్యక్తమవుతోంది. ఒక వేళ అసెంబ్లీ బహిష్కరణకు జగన్ నిర్ణయం తీసుకుంటే... ఆయనపై పారిపోయారని ముద్ర పడుతుంది. దైర్యంగా ఎదుర్కుంటనే రాజకీయంగా గుర్తింపు ఉంటుందని చెబుతున్నారు. ఇదే విషయాన్ని జగన్ శ్రేయోభిలాషిగా పేరు తెచ్చుకున్న ఉండవల్లి అరుణ్ కుమార్ కూడా చెప్పారు. పోరాడమని సలహా ఇచ్చారు. మరి జగన్ ఏం చేయబోతున్నారో ?

### నాయుడుపేట సబ్ డివిజన్ పరిధిలో జిల్లా ఎస్పీ ఆకస్మికంగా సుడిగాలి పర్యటన

తిరుపతి,గురువారం నాడు జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు నాయుడుపేట సబ్ డివిజన్ పరిధిలో ఆకస్మికంగా సుడిగాలి పర్యటన చేశారు. నాయు డుపేట సబ్ డివిజన్ పోలీస్ కార్యాల యం, నాయుడుపేట సర్కిల్ కార్యాల యం, నాయుడుపేట, దొరవారి సత్రం, సూళ్లూరుపేట, తడ పోలీస్ స్టేషన్ లను ఆకని ్మకంగా సందర్శించి, అధికారులు సిబ్బందిని అప్రమత్తం చేశారు.విధులలో ఉన్న ప్రతి ఒక్క పోలీసు సిబ్బంది, అధికారులతో మాట్లాడి వారి సాధక బాధలను అడిగి తెలుసుకుని, ఏవైనా శాఖా పరమైన సమస్యలు ఉంటే మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటన లు జరగకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియ ను జిల్లా పోలీసు సిబ్బంది అధికారుల సమిష్టి కార్యాచరణతో ప్రశాంత వాతావర ణంలో విజయవం తంగా పూర్తి చేయడం చేయగలిగామన్నారు.

# ఏపీకి నిధుల వరద పారుతోందా...

విజయవాడ, జూన్ 20,చంద్రబాబు గెలిచారు. సీఎం అయ్యారు. వెంటనే ఐదు సంతకాలు పెట్టారు. కానీ చాలా మంది సంతకాలు పెడితే పనైపోతుందా అమలవ్వాలి కదా అని మనసులో అనుకుంటున్నారు. ఎందుకంటే ఏపీ ఆర్థిక పరిస్థితి అలా ఉంది మరి. జగన్మోహన్ రెడ్డి ప్రతీ వారి ఆర్బీఐ ముందు కనీసం నాలుగు వేల కోట్ల అప్పుల కోసం నిలబడేవారు. వాటికి తోడు కనిపించిన ప్రతీ ఆస్తి తాకట్టు పెట్టేశారని టీడీపీ నేతలు ఆరోపిస్తూ వస్తున్నారు. ఆదాయం పెరగలేదు. మరి ఎలా అమలు చేస్తారన్నదే సందేహం. ఏపీ కంటే మెరగైన ఆర్థిక పరిస్థితి ఉన్న తెలంగాణలో మాత్రం పథకాల అమలుకు తంటాలు పడుతున్నారు. చంద్రబాబు పాలన మొదలైంది నిర్ణయాలు వేగంగా తీసుకుంటున్నారు తొలి నిర్ణయాలుగా ఏకంగా ఐదు ఫైల్స్‌పై సంతకం చేశారు చంద్రబాబు. తొలి సంతకం మెగా డీఎస్సీ తాను అధికారంలోకి రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ రిలీజ్‌పై తొలి సంతకం చేస్తానన్నారు చంద్రబాబు. ఇచ్చిన మాటకు అనుగుణంగా ఆయన తొలి సంతకం చేశారు. పెన్షన్ల పెంపు సహా మరో మూడు సంతకాలు పెట్టారు. ఇవన్నీ ఖర్చుతో కూడుకున్న వ్యవహారాలే. ముఖ్యంగా సామాజిక పెన్షన్లు. ఇప్పుడు నెలకు పందొమ్మిది వందలకోట్ల వరకూ ఖర్చు అవుతున్నాయి. అది వచ్చే నెల ఒకటో తేదీ నుంచి మూడు వేల కోట్లపైనే అవుతుంది. అదేమీ చిన్న మొత్తం కాదు. 250 పెంచడానికి జగన్మోహన్ రెడ్డి మూడేళ్ల సమయం తీసుకున్నారు. కానీ చంద్రబాబు ఒక్క సంతకంతో వెయ్యి పెంచారు. ఇతర విభాగాల వాళ్లకు పదిహేను వేలుదాకా చేశారు. ఇక మెగా డీఎస్సీ కూడా అనౌన్స్ చేశారు. ఇవన్నీ దీర్ఘకాలంలో ఖర్చులను పెంచేవే. ఇంత క్లిష్టమైన ఆర్థిక పరిస్థితుల్లో చంద్రబాబు ఎలా హామీలు చేస్తారనేది సస్పెన్స్ గా మారింది. పరిస్థితిపై చంద్రబాబు సమీక్ష చేశారా లేదా అన్నదానిపై స్పష్టత లేదు. అయితే సీఎం ఆషామాషీగా చేసి ఉండరని ఆయన లెక్కలు ఆయనకు ఉంటాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. కేంద్రం నుంచి అందే సహకారం.. ఆటోమేటిక్ గా ఏపీలో పెరిగే పెట్టుబడులు, వ్యవహారాలు, వైసీపీ నేతలు దోచిన ఆదాయాన్ని నిలిపేయడం ద్వారా సర్కార్ కు పెరిగే ఆదాయం వంటి వాటివి అంచనా వేసుకునే హామీల అమలు ప్రారంభించారని భావిస్తున్నారు. కేంద్రంలో కీలక భాగస్వామిగా ఉన్న టీడీపీ పదవుల కోసం పట్టుబట్టలేదు. బీజేపీ ఎన్ని ఇస్తే అన్నే తీసుకున్నారు. రాష్ట్రం కోసమే తాను రాజకీయం చేస్తానని అంటున్నారు. ఆయన ప్రధానంగా రాష్ట్రానికి ఆర్థిక సాయం కోరుకున్నారని ఆ మేరకు హామీ వచ్చిందని ఢిల్లీలో ప్రచారం జరుగుతోంది. ఏపీతో పాటు ఎన్డీఏలో మరో కీలక భాగస్వామి అయిన జేడీయూ నేత నితీష్ సీఎంగా ఉన్న బీహార్‌కు సాయం అందబోతోందని చెబుతున్నారు. ఇలాంటి ఓ రిపోర్టుపై .. కేటీఆర్ స్పందించారు ప్రాంతయ పార్టీల వల్ల అదే లాభమన్నారు. మరో వైపు ఏపీలో చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలతో తెలంగాణ ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోంది. ఏపీ అంత విరివిగా పథకాలు అమలు చేయగలిగినప్పుడు మెరుగైన ఆర్థికపరిస్థితి ఉన్న తెలంగాణ ప్రభుత్వం ఎందుకు చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. అయితే తెలంగాణకు గత ప్రభుత్వం చేసిన అప్పులకు కట్టాల్సిన వాయిదాలు పెనుభారంగా ఉన్నాయి. ముఖ్యంగా కాళేశ్వరం కోసం తీసుకున్న అప్పు భారంగా మారింది. అదే సమయంలో ఆర్బీఐ నుంచి తీసుకొచ్చే అప్పుల్ని తగ్గించుకున్నారు. తీసుకునే అప్పుల కన్నా తిరిగి చెల్లించేవే ఎక్కవగా ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. అయితే ప్రజలకు ఈ కారణాలు నచ్చవు.. వారికి ప్రభుత్వం హామీలు అమలు చేసిందా లేదా అన్నదే ముఖ్యం.చంద్రబాబు సంతకాలు చేశారు కానీ ఇంకా అమలు కాలేదు. సంతకాల పవర్ మరో పదిహేను రోజుల నుంచి తేలనుంది. ఆ రోజున... ఒక్కో పెన్షన్ దారునికి ఏడు వేలు ఇస్తారు. ఆ తర్వాత నుంచి నాలుగు వేలు ఇస్తారు. అవి చేతికి అందితే... చాలా వరకూ సక్సెస్ అయినట్లే. లేకపోతే ఇబ్బందికరమే. ధనిక రాష్ట్రం తెలంగాణలో కేసీఆర్ సర్కార్ ఏపీతో పోలిస్తే చాలా తక్కువే అప్పులు చేశారు. అయినా రేవంత్ సర్కార్ హామీల అమలు కోసం కిందా మీదా పడుతుంది.

# పడిపోయిన మిర్చి ధర... గౌడన్ కు పంట



గుంటూరు, జూన్ 20, రాష్ట్రంలో మిర్చి ధరలు పతనమయ్యాయి. గత ఏడాది మేలో క్వింటాల్ మిర్చి కనీస ధర రూ.9 వేలు, గరిష్ట ధర రూ.26,500 పలికాయి. ఈ ఏడది ధరలు తగ్గడంతో క్వింటాల్ కనీస ధర రూ.8 వేలు, గరిష్ట ధర 20,700కి పడిపోయింది. తేజ మంచి రకానికి చెందిన మిర్చీ మాత్రమే క్వింటాల్ రూ.19,500 ధర పలుకుతోంది. మిగిలిన అన్నిరకాల మిర్చి ధరలు గణనీయంగా తగ్గాయి. ఎగుమతులు ప్రారంభంకాకపోవడంతో కోల్డ్ స్టోరేజీల్లో మిర్చీ నిల్వలు పేరుకుపోతున్నాయి. ఇప్పటికే 75 లక్షల మిర్చి బస్తాలు అక్కడ నిల్వ ఉన్నాయి.ఆరుగాలంపాటు చమటోడ్చి పండించిన మిర్చీ పంటను అమ్ముకుని నాలుగు కాసులు చూస్తామనుకున్న రైతుకు ధరలు పడిపోవడంతో నిరాశ ఎదురైంది. ఎగుమతులు ఎప్పుడెప్పుడు ప్రారంభమవుతాయా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇక ఇప్పటికే రాష్ట్రంలో తొలకరి ప్రారంభం కావడంతో మిరప నాట్లు వేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. మన దేశం నుంచి సుమారు 20 దేశాలకు మిర్చి ఎగుమతి అవుతుంది. మిర్చి ఉత్పత్తిలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. 2022-23 వార్షిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ.10,440 కోట్ల విలువైన మిర్చి విదేశాలకు ఎగుమతైంది. లాభాలు ముట్టడంతో గత రెండేళ్లుగా రైతులు మిర్చి పంటపైనే దృష్టి పెడుతున్నారు.అటు కర్ణాటకలో మిర్చి దిగుబడి ఎక్కువగా రావడంతో అక్కడ కోల్డ్ స్టోరేజీలు సరిపోక ఏపీకి తీసుకొచ్చి నిల్వ చేస్తున్నారు. గుంటూరులో దాదాపు వంద వరకూ కోల్డ్‌స్టోరేజీలు ఉన్నాయి. వీటిల్లో 3.21 లక్షల టన్నులకు పైగా మిర్చిని నిల్వ చేశారు. ఇందులో 2.71 లక్షల మెట్రిక్ టన్నుల పంట రైతులది. మిగిలిన 52 వేల మెట్రిక్ టన్నుల పంట వ్యాపారులది. ఇక పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఉన్న కోల్డ్ స్టోరేజీలల్లోనూ 75 లక్షల బస్తాల పంట నిల్వ ఉంది. ఒక్కో బస్తా 40 కిలోలు ఉంటుంది. ఉత్పత్తి పెరడం వల్ల ధర రోజురోజుకీ తగ్గుతుండటం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది.

# ఆరో పెద్ద పార్టీగా టీడీపీ

గుంటూరు, జూన్ 20, తెలుగుదేశం పార్టీ జాతీయస్థాయిలో మరోసారి గుర్తింపు సాధించింది. 18వ లోక్ సభలో ఆరు పెద్ద పార్టీగా అవతరించింది. 41 పార్టీల సభ్యులతో కొత్తగా ఏర్పడనున్న లోక్ సభలో.. 16 మంది సభ్యులతో ఈ ఘనత సాధించింది. జాతీయస్థాయిలో టిడిపి గుర్తింపు సాధించడం ఇది మొదటిసారి కాదు. గతంలో లోక్ సభలో ప్రధాన ప్రతిపక్ష హోదా టిడిపికి దక్కింది. జాతీయస్థాయిలో ప్రధాన ప్రతిపక్ష హోదాతో సముచిత స్థానం దక్కించుకుంది ఆ పార్టీ. మళ్లీ ఇన్నాళ్లకు ఈ చాన్స్ వచ్చింది.ఇటీవల దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ముచ్చటగా ఎన్డీఏ మూడోసారి అధికారాన్ని సొంతం చేసుకుంది. గత రెండు ఎన్నికల్లో బిజెపి సొంతంగా అధికారంలోకి రాగా.. ఇప్పుడు ఎన్ డి ఏ మిత్రపక్షాల సాయంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. ముఖ్యంగా ఎన్డీఏ లో రెండో అతిపెద్ద పార్టీగా తెలుగుదేశం నిలిచింది. జెడియు మరో భాగస్వామ్యపక్షంగా నిలబడింది. అందుకే చంద్రబాబుతో పాటు నితీష్ కుమార్ కు ప్రాధాన్యత దక్కింది. తాజాగా లోక్సభలో సంఖ్యాపరంగా తెలుగుదేశం పార్టీ ఆరో స్థానంలో నిలిచింది. ఆ పార్టీకి ప్రత్యర్థిగా ఉన్న వైసిపి 15వ స్థానానికి పరిమితం అయ్యింది.41 పార్టీల సభ్యులతో లోక్సభ కొలువుదీరింది. బిజెపి నుంచి 240 మంది సభ్యులు, కాంగ్రెస్ 99, సమాజ్ వాది 37, తృణమూల్ కాంగ్రెస్ 29, డీఎంకే 22 స్థానాలు సాధించాయి. టాప్ 5 లో నిలిచాయి. 16 మంది సభ్యులతో తెలుగుదేశం పార్టీ ఆరో పెద్ద పార్టీగా అవతరించింది. ఈ ఎన్నికల్లో బిజెపికి మాత్రమే మూడంకెల స్థానాలు దక్కాయి. 34 పార్టీలకు ఏక అంకె సీట్లు వచ్చాయి. 16 పార్టీలకు కేవలం ఒక్కో సీటు మాత్రమే వచ్చింది. వైసీపీకి నాలుగు స్థానాలు వచ్చాయి. జనసేనకు రెండు సీట్లు దక్కాయి.అయితే ఏపీ నుంచి తెలుగుదేశం పార్టీకి 16 సీట్లు దక్కడం విశేషం. ఎన్డీఏలో రెండో పెద్ద పార్టీగా, జాతీయస్థాయిలో ఆరో పెద్ద పార్టీగా నిలవడం విశేషం.జాతీయస్థాయిలో తెలుగుదేశం పార్టీ చక్రం తిప్పిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఎన్టీఆర్ తోపాటు చంద్రబాబు సైతం సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాట్లు క్రియాశీలక పాత్ర పోషించారు. ఇందిరా గాంధీ హత్య సమయంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్కు సానుకూల పవనాలు వీచాయి. కానీ ఏపీలో మాత్రం తెలుగుదేశం పార్టీ హవా నడిచింది. ఆ పార్టీ మెరుగైన సీట్లను దక్కించుకుంది. దేశవ్యాప్తంగా విపక్షాలు తుడుచుపెట్టుకుపోయాయి. ఆ సమయంలో లోక్సభలో ప్రతిపక్ష పాత్ర పోషించింది టిడిపి. యునైటెడ్ ఫ్రంట్, నేషనల్ ఫ్రంట్ ఏర్పాటులో కూడా కీలకంగా మారింది. 1996లో వాజ్పేయి నేతృత్వంలోని ఎన్డీఏ సుస్థిరతకు కూడా టిడిపి ఒక కారణం. ఇప్పుడు ఈ ఎన్నికల్లో ఎన్డీఏ భాగస్వామ్య పక్షంగా టిడిపి పాత్ర కీలకం. ఆరో అతిపెద్ద పార్టీగా అవతరించి జాతీయ స్థాయిలో సైతం టిడిపి క్రియాశీలక పాత్ర పోషిస్తుండడం విశేషం.

# బ్యాంకుల నుంచి కదులుతున్న ఫిక్సిడ్ డిపాజిట్లు

గుంటూరు, జూన్ 20,ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రంగాన్ని ఐదేళ్లుగా పీడిస్తున్న స్తబ్దత మెల్లగా వీడుతోంది. భవిష్యత్తు ఏమవుతుందో తెలియక నలిగి పోయిన వాళ్లంతా మెల్లగా ఊపిరిపీలుస్తున్నారు. ఎక్కడ పెట్టుబడి పెట్టాలో తెలీక ఇన్నాళ్లు గందరగోళానికి గురైన వారికి ఎన్నికల ఫలితాలతో స్పష్టత వచ్చేసింది.ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంతో ఏపీ రియల్ ఎస్టేట్ రంగం ఊపిరి పీల్చుకుంది. చేతిలో డబ్బున్నా పెట్టుబడులు పెట్టలేక బ్యాంకులకు పరిమితం చేసిన వారు కూడా ఇప్పుడు వాటిని నగదుగా మార్చుకుంటున్నారు. గత నాలుగైదు రోజుల్లో భారీ ఎత్తున ఫిక్సిడ్ డిపాజట్లను రద్దు చేసుకుంటున్నారని బ్యాంకులు ధృవీకరిస్తున్నాయి. కోట్లలో డిపాజిట్లు చేసిన ఖాతాదారులు సైతం రియల్ ఎస్టేట్ పెట్టుబడుల కోసం నగదుగా మార్చుకుంటున్నారు.చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వారంలోపే బ్యాంకు డిపాజిట్లను కరిగిస్తున్న వారి సంఖ్య పెరిగింది. ఇన్నాళ్లు బ్యాంకుల్లో ఫిక్స్డ్ డిపాజిట్లుగా ఉన్న నోట్ల కట్టలకు కాళ్లు వస్తున్నాయి. డిపాజిట్లను నగదుగా మార్చుకుని అధిక వడ్డీ, ఆదాయం లభించే మార్గాలపై పెట్టుబడి పెట్టేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు.ఫిక్సిడ్ డిపాజిట్లు తగ్గిపోతే బ్యాంకుల లాభాలు గణనీయంగా తగ్గుతాయిఆంధ్రప్రదేశ్‌లో గత ఐదేళ్లుగా రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న అనిశ్చిత క్రమంగా తొలగిపోతోంది. ఐదేళ్ల క్రితం వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇసుక తవ్వకాలను నిలిపివేయడంతో మొదలైన నిర్మాణరంగం డౌన్ ఫాల్ ఆ తర్వాత కోలుకోలేదు. చిన్నాచితక పెట్టుబడిదారులు కుదేలైపోయారు. నిర్మాణాలు పూర్తైనా అమ్ముకోలేక అల్లాడిపోయారు. బ్యాంకు వడ్డీలు తీర్చడానికి అయినకాడికి అమ్ముకున్న వారు కొందరైతే ఇసుక కొరత, నిర్మాణ వ్యయానికి అంచనా వ్యయానికి మధ్య వ్యత్యాసం 30-40శాతం పెరగడంతో ప్రాజెక్టుల్ని మధ్యలో ఆపేసిన వారు ఇంకొందరు.ఇక 2014లో రాష్ట్ర విభజన తర్వాత 2015లో అమరావతి రాజధానిగా ప్రకటన వెలువడింది. తొలి ఏడాది కొంత సందిగ్ధత కొనసాగినా రాజధాని నిర్మాణ పనులు ప్రారంభించి 2016 ప్రథమార్థంలోనే హైదరాబాద్ నుంచి ప్రభుత్వ కార్యాలయాలను విజయవాడకు తరలించారు. మొదట్లో తాత్కలికంగా ఎక్కడో చోట సర్దుకుపోయినా ఆర్నెల్లలోనే వెలగపూడిలో సచివాలయం, విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో ప్రభుత్వ కార్యాలయాల కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఆ తర్వాత రాజధాని నిర్మాణ పనుల్లో వేగంగా పెంచారు.విజయవాడ కేంద్రంగా ప్రభుత్వ కార్యకలాపాలు నడవడం, కృష్ణా నదికి అవతలి వైపు రాజధాని నిర్మాణంతో రియల్ ఎస్టేట్ జెట్ స్పీడ్‌లో వెళ్లింది. ఇక హైదరాబాద్ నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన ఉద్యోగులు కూడా కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టారు. విజయవాడ నగరం విస్తరించడానికి పరిమితులు ఉండటం, వ్యవసాయ భూములు కావడంతో నగరం వేగంగా గుంటూరు జిల్లా తాడేపల్లి వైపు విస్తరించింది. 2014కు ముందతో పోలిస్తే రెండు మూడు రెట్లు ఎక్కువగా భూముల ధరలు పెరిగాయి.2014 తర్వాత రాజధాని ఎక్కడ ఏర్పాటు అవుతుందనే విషయంలో రకరకాల ప్రచారాలు జరగడంతో మొదట్లో పెట్టుబడులు పెట్టిన వారు అప్పులు పాలైనా ఆ తర్వాత ఏడాది నుంచి స్థిరమైన వృద్ధి కనిపించింది. 2014లో తాడేపల్లి ప్రాంతంలో గజం భూమి ధర రూ.10-15వేల మధ్యలో ఉంటే 2019 నాటికి అది రూ.50వేలకు చేరింది. ఉండవల్లి, మంగళగిరి, నంబూరు, కాజా ఇలా జాతీయ రహదారి వెంట భారీ ఎత్తున రియల్ ఎస్టేట్ నడిచింది. ఇటు విజయవాడలో కూడా ఐదేళ్లలో భారీగా నిర్మాణాలు జరిగాయి.2019ఎన్నికల ఫలితాల తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారం మొత్తం తలకిందులై పోయింది. భూములపై పెట్టుబడులు పెట్టిన వారంతా లబోదిబోమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఈఎంఐలు కడుతున్నా భూముల భవిష్యత్తు ఏమవుతుందో తెలియక ఆందోళన చెందారు. ఇక గ్రూప్ హౌస్‌లు, చిన్నాచితక పెట్టుబడిదారులైతే విలవిలలాడిపోయారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, టౌన్ ప్లానింగ్ వేధింపులు, ఇసుక కొరత, కార్పొరేషన్లలో సిబ్బంది అరాచకాలతో విసిగిపోయారు. ఎంత పెద్ద బిల్డరైనా వార్డు వాలంటీర్లకు లోకువయ్యారన్నట్టు పరిస్థితి తయారైంది. స్థానిక నాయకులకు కప్పం కట్టనిదే నిర్మాణాలు జరగనివ్వని పరిస్థితి తెచ్చారు. దీంతో నిర్మాణదారులు పనులు నిలుపుకుని ఎన్నికల ఫలితాల కోసం ఎదురుచూశారు. రూ.100కోట్లకు పైగా వార?షిక లావాదేవీలు జరిగే స్కేల్ 4 బ్రాంచీల్లో ఈ తరహా రద్దీ ఎక్కువగా ఉంటోంది. బ్యాంక్ బ్రాంచీల వారిగా లాభాలను పరిగణలోకి తీసుకుంటే ఈ ప్రాఫిట్స్ మళ్లీ గాడిన పడటానికి ఆర్నెల్ల సమయం పట్టొచ్చని అంచనా వేస్తున్నారు. రిజిస్ట్రేషన్ల సమయంలో లావాదేవీలను బ్యాంకు ఖాతాలతో చేయాల్సి ఉండటంతో త్వరలోనే డిపాజిట్లు మళ్లీ పెరుగుతాయని ఆశాభావం బ్యాంకుల్లో ఉంది.

# కోవెలకుంట్ల దొర్నిపాడు మండలాల్లో కరువు బృందం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 20-కోవెలకుంట్ల మండలం భీమునిపాడు గ్రామంలో రబీ 2023-24 కు సంబంధించి దెబ్బతిన్న శనగ, మినుము, జొన్న పంటల రైతులతో ముచ్చటిస్తూ కరవు సమస్యలను అడిగి తెలుసుకున్న కరువు బృందం సభ్యులు. అలాగే దొర్నిపాడు. హరివరం లో దెబ్బతిన్న శనగ. మినుము. జొన్న పంటల రైతులతో ముచ్చటించారు. డిపార్ట్మెంట్ ఆఫ్ ఎక్స్పెండేచర్ డైరెక్టర్ చిన్మయ పుండ్లిక్ రావు గాట్మేర్ (ఐఏఎస్), తాగు నీరు, పారిశుద్ధ్యశాఖ డిప్యూటీ అడ్వైజర్ (పీహెచ్ఈ) ఆషిస్ పాండే, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రటరీ అరవింద కుమార్ సోని.కరవు బృందం వెంట పాల్గొన్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, పంట దెబ్బతిన్న రైతులు.అంతకు ముందు దెబ్బతిన్న పంట పొలాలు, తాగునీటి ఎద్దడిపై సంబంధిత శాఖల అధికారులు ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను పరిశీలించారు.

# దేవాదాయ శాఖ మంత్రి కి మహానంది అర్చకుల ఆశీర్వచనం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 20- దేవాదాయ శాఖ మంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి కి మహానంది అర్చకుల ఆశీర్వచనం పలికారు. అమరావతి లో ఆనం రామనారాయణరెడ్డి దేవదాయశాఖ మంత్రి గా గురువారం బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం కమిషనర్ గారి కార్యాలయంలో తొలి సంతకం చేశారు . కమిషనర్ గారి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ప్రధాన దేవస్థానాల నుంచి ఆశీర్వచనములనుఏర్పాటు చేసినందున మహానంది దేవస్థానం తరపునఆలయకార్యనిర్వహణాధికారిచంద్రశేఖర్‌రెడ్డి గారి ఆధ్వర్యంలో వేదపండితులు, ప్రధానార్చకులు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందించినారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లాలో ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం పర్యటన



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 20-గురువారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లాల్లోని కరువు పరిస్థితిపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు గారితో కలిసి పరిశీలించిన ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం సభ్యులు డిపార్ట్మెంట్ ఆఫ్ ఎక్స్పెండేచర్ డైరెక్టర్ చిన్మయ పుండ్లిక్ రావు గాట్మేర్ గారు (ఐఏఎస్), తాగు నీరు, పారిశుద్ధ్యశాఖ డిప్యూటీ అడ్వైజర్ (పీహెచ్ఈ) ఆషిస్ పాండే గారు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రటరీ అరవింద కుమార్ సోని గారు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో 2023-24 రబీ సీజన్లో నెలకొన్న కరవు పరిస్థితులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించిన జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు. ఈ సమావేశంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి , జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.



ఉరవకొండ మండలం పెద్ద కౌకుంట్ల గ్రామంలో రబీ 2023-24లో కరువు పరిస్థితిపై క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులతో సమావేశం నిర్వహించిన ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం లీడర్ (జాయింట్ సెక్రటరీ ఽ సిఈఓ, పి.ఎం.ఎఫ్.బి.వై డిపార్ట్మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్, న్యూఢిల్లీ) రితేష్ చౌహాన్ ఐ.ఏ.ఎస్, హైదరాబాద్ డిటిఈ. ఆఫ్ ఆయిల్ సీడ్స్ డెవలప్మెంట్ డైరెక్టర్ డా.కె.పొన్ను స్వామి, న్యూ ఢిల్లీ ఎంఎంసిఎఫ్సి డిపార్ట్మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ సునీల్ దూబే, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, తదితరులు..ఈ కార్యక్రమంలో పాల్గొన్న గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాసుల రెడ్డి, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, పశుసంవర్ధక శాఖ డిడి రఘునాథరెడ్డి, ఏపీఎమ్ఐపి పిడి ఫిరోజ్ ఖాన్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ భాష, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు, రైతులు..

# యూనిక్ అండ్ నైస్ రెస్టారెంట్ ను ప్రారంభించిన మంత్రి ఫరూక్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 20-నంద్యాల స్థానిక పద్మావతి నగర్ లో రంగా వంశీకృష్ణ ఏర్పాటుచేసిన యూనిక్ అండ్ నైస్ రెస్టారెంట్ ని న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఒకరిపై ఆధారపడకుండా స్వయంకృషితో వారి కాళ్లపై వారు నిలబడేలా వారికి నైపుణ్యం ఉన్న వాటిలో ముందుకు వెళ్లడమేగాక గాక మరి కొందరికి ఉపాధి కల్పించడం చాలా మంచి శుభ పరిణామం అన్నారు . నంద్యాలలో ఇటువంటి రెస్టారెంట్ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. పోటీ ప్రపంచంలో పోటీపడుతూ అందరికీ నాణ్యమైన భోజనం అందించి వారి ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు . ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు ఎన్ఎండి ఫిరోజ్ , ఎన్ఎండి ఫయాజ్ , టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తులసిరెడ్డి , ఆనంద్ గురూజీ , చలం బాబు , మధు , కౌన్సిలర్ శ్యామసుందర్ లాల్ , డాక్టర్ మధు , బుజ్జి , కాసెట్రీ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ నుండి అమరావతికి ప్రభుత్వ కార్యాలయాలను తరలించవద్దు

రాయలసీమ రవికుమార్,రాష్ట్ర అధ్యక్షులు,ఆర్వీపీఎస్.
సుంకన్న,రాష్ట్ర అధ్యక్షులు,రాయలసీమ హక్కుల పోరాట సమితి.



కర్నూలు:-గత ప్రభుత్వంలో రాయలసీమ కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి కార్యాలయాలను కర్నూలు నుండి అమరావతికి తరలించవద్దని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాయలసీమ రవికుమార్, రాయలసీమ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సుంకన్న ప్రభూత్వాన్ని డిమాండ్ చేశారు.కర్నూలు నగరంలోని స్థానిక ఆర్వీపీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ శ్రీబాగ్ ఒప్పందం మేరకు రాష్ట్ర రాజధానిని కర్నూలులో ఏర్పాటు చేయవలసివున్న పాలకులు నిర్లక్ష్యం కారణంగా తరతరాలుగా రాయలసీమ వివక్షకు గురవుతూనేవున్నదని అయితే గత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం మేరకు రాష్ట్రస్థాయి కార్యాలయాలైన మానవహక్కుల కమిషన్ కార్యాలయం,లోకాయుక్త కార్యాలయం,విద్యుత్ రెగ్యులేటరీ అథారిటీ కార్యాలయం,వక్ఫ్ బోర్డు కార్యాలయాలను కర్నూలులో ఏర్పాటు చేసారని అయితే కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం ఆయా కార్యాలయాలను అమరావతికి తరలించాలని నిర్ణయించిదని దీనిని రాయలసీమ సంఘాలకు తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా మని ఇప్పటికే రాష్ట్ర రాజధాని,నీటి ప్రాజెక్టులు,న్యాయబద్ధమైన నీటివాట కోల్పోయి కరువు వలస లతో అల్లాడుతున్న రాయలసీమ ప్రాంతం ఏర్పాటైన ప్రభుత్వ కార్యా లయాలను తరలించి ప్రస్తుత ప్రభుత్వం రాయలసీమకు మరింత అన్యాయం చేసే ఆలోచనలను మానుకోవాలని అన్నారు.రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు కేవలం అమరావతి నిర్మాణంతో సాధ్యమవుతా యని ప్రభుత్వం భావించడం రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలపై వివక్ష చూపించడమే అవుతుందని రాష్ట్రంలోని అన్నిప్రాంతాల అభివృద్ధి దిశగా కొత్త ప్రభుత్వం పనిచేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలోరాయలసీమ విద్యార్థిపోరాటసమితి, హక్కుల పోరాట సమితినాయకులు నాగేష్,అశోక్, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే గిరిజనుల అభివృద్ధి...

## ఏపీ యస్ .టీ. కమిషన్ సభ్యులు శ్రీ వాడిత్య శంకర్ నాయక్ ....

కర్నూలు జూన్ 20:- విద్యతోనే గిరిజన ల అభివృద్ధి జరుగుతుందని అందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ప్రాముఖ్యం ఇస్తుందని మరియు గిరిజనుల అభివృద్ధికి జిల్లా అధికారులు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నది అని ఏపీ స్టేట్ కమిషన్ ఫర్ షెడ్యూల్ ట్రైబ్స్ సభ్యులు శ్రీ వాడిత్య శంకర్ నాయక్ పేర్కొన్నారు.గురువారం సాయంకాలం స్థానిక స్టేట్ గెస్ట్ హౌస్ లో ఏపీ స్టేట్ కమిషన్ ఫర్ షెడ్యూల్ ట్రైబ్స్ సభ్యులు శ్రీ వాడిత్య శంకర్ నాయక్ పాత్రికేయుల తో సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ...మన రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రజల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి గిరిజనులను అభివృద్ధి పదంలో నడిపించడం చేస్తుంది అని అన్నారు. తన జిల్లా పర్యటన సందర్భంగా గిరిజన ప్రజల నుండి కొన్ని విజ్ఞాపనలు వచ్చాయని ముఖ్యంగా జిల్లాలోని గిరిజన సంక్షేమ భవనాలను గురించి, గురుకుల పాఠశాల గురించి, మారుమూల ప్రాంతాల్లోని గిరిజనుల గ్రామాలలో ప్రాథమిక మౌలిక వసతులను గురించి వచ్చియని తెలిపారు.ఉమ్మడి కర్నూలు జిల్లాలో గిరిజనులకు సొంత స్కూల్ భవనాలు , హాస్టల్లో భవనాలు ఇంకా అవసరం ఉన్నదని వాటిని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ,ఉమ్మడి జిల్లాలో చాలామంది గిరిజనుల పిల్లలు డిగ్రీ స్థాయి వరకు చేరుకోలేకపోతున్నారని కావున ఆ పిల్లలందరినీ డిగ్రీ స్థాయి వరకు చదివించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని ,ఉమ్మడి జిల్లాలో ఆరోగ్యపరంగా గిరిజనుల అవసరాల రీత్యా వారికి గ్రామాలలో సౌకర్యాలు ఇంకా మెరుగుపరచాలని ,ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల లో గిరిజనులకు సంబంధించిన బ్యాక్ లాగ్ పదవుల ఖాళీలు చాలా ఉన్నవి వాటిని వెంటనే భర్తీ చేయవలసిందిగా , అలాగే వారికి రావలసిన ప్రమోషన్లు వచ్చేల చర్యలు తీసుకోవాల్సిందిగా , గిరిజన గ్రామాలలో ఉపాధి హామీ పనులు పక్కగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని , గిరిజనులు సాగు చేసుకుంటున్నా భూములపై వారికి హక్కు కల్పించాలని గిరిజనులు కోరుకుంటున్నారని తెలియజేశారు.కమిటీ సభ్యునిగా నాకు అందిన గిరిజనుల విజ్ఞాపనలను కలెక్టర్ , ఎస్టి కమిషన్ ,రాష్ట్ర ప్రభుత్వము మరియు గవర్నర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని పాత్రికేయుల సమావేశంలో తెలియజేశారు...ఈ సమావేశానికి గిరిజన ప్రజా సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ కూడా పాల్గొన్నారు.

# బాల కార్మికుల నిర్మూలనకు సహకరించండి

## ఎన్. బషీరున్నీసా బేగం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 20- బాల కార్మికుల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసర్ ఎన్. బషిరున్నీసా బేగం పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జూన్ నెలలో బాల కార్మికుల నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బట్టల షాపులలో. కిరాణా షాపుల యందు 15 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన పిల్లలు ఉండ కూడదన్నారు . అలాగే ఇండ్ల లో . ఇండ్ల నిర్మాణంలో. గ్యారేజిలో పనిచేస్తున్న పిల్లలు 19 సంవత్సరాల లోపు వారు ఉండ కూడదని తెలిపారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించిన యెడల 50 వేల జరిమానా. మరియు రెండు సంవత్సరాల శిక్ష అనుభవిస్తారని అన్నారు. పిల్లల భవిష్యత్తు నాశనం చేయవద్దని సూచించారు. పిల్లలు పనిచేయడం వల్ల భవిష్యత్తులో పనికిరాకుండా పోతారని మరియు చెడు అలవాట్లకు బానిసలై పోతారని అన్నారు. గుడికాడ. హోటళ్లు . సెంటర్ల లో ఎవరైన బాల కార్మికులు కనిపిస్తే 1098 కాల్ చేయాలని కోరారు. లేని పక్షంలోమా సెల్‌నెంబర్ 9492555169 కు ఫోన్ చేయవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం సహకరించాలని పిలుపునిచ్చారు .

# బ్రిడ్జి ని పరిశీలించిన టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 20-నంద్యాల స్థానిక నందమూరి నగర్ పోయే రోడ్డులో నిర్మాణంలో ఉన్న కుందు బ్రిడ్జిని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ టిడిపి బృందంతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయిడు గారు 2017 లో కుందూ నది పై బ్రిడ్జికి శంకుస్థాపన చేసి పనులు మొదలుపెట్టారని, కానీ గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పట్టించుకోకపోవడంతో ఇన్ని సంవత్సరాలైన బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాలేదన్నారు . గత ఐదేళు గా ముగ్గురు కాంట్రాక్టర్లను మారిన నిర్మాణం పూర్తి కాలేదని అన్నారు.. ఈ బ్రిడ్జి నిర్మాణం వల్ల 30 గ్రామాల ప్రజల రాకపోకలకు సులభతరం అవుతుందని ప్రజలకు ఇంత అవసరమైన బ్రిడ్జి నిర్మాణాన్ని వలస నాయకులు గాలికొదిలేసారని అన్నారు , ఇప్పుడు స్థానికుడైనా ఎన్ఎండి ఫరూక్ గారి నాయకత్వంలో బ్రిడ్జి నిర్మాణాన్ని అతి త్వరలో పూర్తి చేస్తామన్నారు. అనంతరం బ్రిడ్జి కాంట్రాక్టర్ తో మాట్లాడి అడ్డంకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యలను మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గారి దృష్టికి తీసుకొని వెళ్లి పనులు పూర్తి చేస్తామని చెప్పారు . బ్రిడ్జి నిర్మాణం కోసం అవసరమైతే తమ కుటుంబానికి చెందిన భూములను సైతం ప్రభుత్వాన్నికి అందిస్తామని హామీని చ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భారీగా పాల్గొన్నారు.

# జాతీయస్థాయి సూపర్ సెవెన్ క్రికెట్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ బాలుర జట్టు.



కర్నూలు, స్పోర్ట్స్ న్యూస్: ఈనెల హర్యానా రాష్ట్రంలోని కురుక్షేత్ర పట్టణంలో 22వ తేదీ నుంచి 204 తేదీ వరకు నిర్వహించబోయే జాతీయస్థాయి 20వ యూత్ సూపర్ సెవెన్ క్రికెట్ పోటీలలో పాల్గొని ఆంధ్రప్రదేశ్ బాలుర జట్టు గురువారం కర్నూలు నుంచి బయలుదేరినట్టు రాష్ట్ర సంఘం కార్యదర్శి దేవేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు జాతీయ స్థాయి పోటీలలో క్రీడా నైపుణ్యం కనపరిచి విజయంతో తిరిగి రావాలని అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు అఖిల్ మల్లికార్జున మహబూబ్ బాషా కోచ్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారుబాలుర జట్టు: లోహిత్ , రవి, విజయ్ ఇంజేటి, జమ్సీర్ వలి, రామ్ చరణ్, శామ్యూల్ జోయి , పాండు రంగ, దావూద్ హుస్సేన్ ,వివేకానంద రెడ్డి , ఆదిత్య ,దేవ వెంకట కొండయ్య, రంజిత్ కుమార్ , ఉమా మహేశ్వర్.జట్టు కోచ్ ప్రసన్నకుమార్.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190